RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 432 | 25 శనివారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--




## నీట్ కుట్రల వెనుక విదేశీ శక్తులు

### : బండి సంజయ్



ఢిల్లీలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన... విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని స్పష్టం చేశారు. నీట్ ఆందోళనల ముసుగులో దేశంలో అరాచకాలు సృష్టించేందుకు కొన్ని కుట్ర శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఎండగట్టారు.నీట్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల కలలు, తల్లిదండ్రుల ఆశలతో ముడిపడి ఉన్న అంశమని, ఈ ఘటనపై ప్రధాని మోదీ తీవ్రంగా కలత చెందారని బండి సంజయ్ తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశామని, ఇప్పటికే సీబీఐ విచారణ వేగవంతం చేసి 11 మంది ఫ్యాకల్టీ సహా మొత్తం 17 మందిని అరెస్ట్ చేసిందని చెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా దీనిపై క్షమాపణలు చెప్పారని గుర్తుచేశారు. విద్యార్థుల విద్యా సంవత్సరం ఏమాత్రం వృథా కాకూడదనే ఉద్దేశంతో కేవలం 40 రోజుల్లోనే మళ్లీ పరీక్షలు పూర్తి చేసి, ఫలితాలను కూడా వెల్లడించామని వివరించారు.ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో కమ్యూనిస్టు శక్తులు తీవ్ర అరాచకం సృష్టించాయని ఆయన ఆరోపించారు. ఏకంగా దేశ పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్రలు చేస్తూ, దేశ వ్యతిరేక నినాదాలతో విరుచుకుపడ్డారని మండిపడ్డారు. నిరసనల పేరుతో పోలీసులపై, మహిళా జర్నలిస్టులపై అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దాడులు చేశారని విమర్శించారు. ఈ హింసలో 118 మంది పోలీసుల తలలు పగిలి తీవ్ర గాయాలైనా, అత్యంత సంయమనం పాటిస్తూ ఫైరింగ్ చేయలేదని, శాంతిభద్రతల రక్షణ కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు.ఢిల్లీలో చెలరేగిన ఈ ఉద్రిక్తతల వెనుక విదేశీ కుట్ర కోణం ఉందని బండి సంజయ్ సంచలన ఆరోపణ చేశారు. పాకిస్థాన్ కేంద్రంగా సోషల్ మీడియాలో నిమిషాల వ్యవధిలో విష ప్రచారం చేస్తూ, దేశంలో అశాంతిని రేపేందుకు కుట్రలు పన్నుతున్నారని వెల్లడించారు. దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, భారత్‌లో అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తున్న పాకిస్థాన్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను తక్షణమే బ్లాక్ చేసిందని బండి సంజయ్ తెలిపారు.

## విద్యార్థులతో పెట్టుకుంటే

# ప్రభుత్వాలే కూలిపోతాయి

### : కేటీఆర్

నీట్ ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారం, ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యలకు నిరసనగా బీఆర్ఎస్ శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో నిరసన చేపట్టింది. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) పిలుపుతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు, యువకులు హాజరయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన జన్మదిన వేడుకలను రద్దు చేసుకుని నల్లచొక్కా ధరించి ఈ ధర్నాలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న నీట్ పేపర్ లీక్‌కి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యార్థులు ప్రభుత్వాన్ని కూల్చాలనుకోవడం లేదని, తమకు జరిగిన అన్యాయంపై న్యాయం మాత్రమే కోరుతున్నారని అన్నారు.

యువత శక్తిని ఎవరూ తక్కువ అంచనా వేయవద్దని కేటీఆర్ హెచ్చరించారు. "ఇది భయపడే జనరేషన్ కాదు.. పాలకులను భయపెట్టే జనరేషన్" అని వ్యాఖ్యానించారు. యువతతో ఘర్షణ పడిన నేపాల్, బంగ్లాదేశ్ ప్రభుత్వాలు కూలిపోయిన పరిస్థితిని కేంద్రం గుర్తుంచుకోవాలని సూచించారు. గతంలో ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన చరిత్ర తమదేనని, ఇప్పుడు కూడా విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ తాము ధర్నా చేస్తుంటే, దానిని అడ్డుకునేందుకు యూత్ కాంగ్రెస్‌ను పంపడం ఎందుకని ప్రశ్నించారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో



బీఆర్ఎస్వీ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులను బెదిరించే హక్కు మీకెవరిచ్చారు?

### .. యూనివర్సిటీలపై రాహుల్ ఫైర్

జంతర్‌మంతర్‌లో జరుగుతున్న నిరసనలకు దూరంగా ఉండాలని ఢిల్లీ యూనివర్సిటీ (డీయూ) విద్యార్థులకు జారీ చేసిన సూచనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకుంటున్న విద్యార్థులను బెదిరించే హక్కు యూనివర్సిటీకి ఎవరిచ్చారని ప్రశ్నించారు. "సమయం వచ్చినప్పుడు మీరే జవాబు చెప్పాల్సి ఉంటుంది" అన్నారు.

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ జంతర్‌మంతర్‌లో జరుగుతున్న నిరసనలకు దూరంగా ఉండాలని డీయూ గురువారం సోషల్ మీడియాలో అడ్వైజరీ విడుదల చేసింది. జంతర్‌మంతర్‌లో జరిగే చట్టవిరుద్ధ సమావేశాల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. విద్యార్థుల భద్రతతో పాటు వారి విద్యా, ఉద్యోగ అవకాశాలపై కూడా ప్రభావం పడొచ్చని పేర్కొంది. సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాన్ని కూడా నమ్మొద్దని సూచించింది.ఇదే తరహా సూచనను జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) కూడా విడుదల చేసింది. జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనలకు వెళ్లొద్దని, సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విద్యార్థులకు సూచించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలతో పాటు యూనివర్సిటీ క్రమశిక్షణా చర్యలు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

యూనివర్సిటీల చర్యలను పలువురు తీవ్రంగా విమర్శించారు. విద్యార్థుల గొంతు నొక్కడం కంటే వారి అభిప్రాయాలను గౌరవించాలని నటి పూజా భట్ పేర్కొన్నారు. డీయూ మాజీ విద్యార్థి, కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హూడా కూడా అడ్వైజరీపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా, ఇటీవల ఐఐటీ రూర్కీ కూడా



రాజకీయ ఆందోళనల్లో పాల్గొనవద్దని విద్యార్థులకు సూచించగా, ఇది ప్రతి ఏడాది జారీ చేసే సాధారణ మార్గదర్శకమేనని స్పష్టీకరించింది.

### ఢిల్లీలో జరిగిన నీట్ ఆందోళనల్లో

## కేసీఆర్ ఎందుకు లేరు?

### : మహేశ్ కుమార్ గౌడ్



ఢిల్లీలో జరిగిన విద్యార్థుల ఆందోళన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎందుకు పాల్గొనలేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీజేపీతో ఉన్న లోపాయకారీ ఒప్పందం కారణంగానే బీఆర్ఎస్ నేతలు ఢిల్లీకి వెళ్లి నిరసన తెలపలేకపోయారని ఆయన విమర్శించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు తెచ్చుకుని, వారి ఎంపీ స్థానాలను బీజేపీకి దానం చేశారని ఆరోపించారు. దేశంలో పలు ప్రాంతీయ పార్టీల వలే బీఆర్ఎస్ కూడా బీజేపీ గుప్పిట్లోనే ఉందనేది పచ్చి నిజమని, అందుకే గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రతిపాదించిన బిల్లులన్నింటికీ బీఆర్ఎస్ మద్దతుగా నిలిచిందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఢిల్లీకి వెళ్లకపోయినా, నీట్ ఉద్యమానికి పూర్తిస్థాయిలో మద్దతుగా నిలిచారని అన్నారు.

నెల రోజులుగా నీట్ సమస్యపై స్పందించని బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ధర్నా చౌక్ వద్ద కూర్చుని నాటకాలు ఆడుతున్నారని మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎన్ని వేషాలు వేసినా ప్రజలు ఇక నమ్మే పరిస్థితి లేదని, విశ్వవిద్యాలయాల ప్రాంగణాల్లోకి వెళ్లే ధైర్యం వారికి ఉందా అని నిలదీశారు. గత పాలనలో ఎంతోమంది విద్యార్థుల బలవన్మరణాలకు, నిరుద్యోగుల ఆత్మహత్యలకు బాధ్యులెవరని ప్రశ్నించారు. కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కోసమే నిరుద్యోగులను వాడుకున్నారని విమర్శించారు.గత ప్రభుత్వ హయాంలో సాగిన పోలీసు రాజ్యం, విచ్చలవిడిగా జరిగిన ఇసుక మాఫియా దోపిడీని తెలంగాణ ప్రజలు ఇంకా మరిచిపోలేదని ఆయన ధ్వజమెత్తారు. నీళ్ల ప్రాజెక్టుల గురించి హరీశ్ రావు మాట్లాడుతున్నారని, కానీ వారి పాలనలో నీళ్ల పేరుతో జరిగిన భారీ దోపిడీ, అక్రమాలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని స్పష్టం చేశారు.

### జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ పార్టీ

## నిరసనలో పాల్గొననున్న మమతా బెనర్జీ

తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జాతీయ రాజకీయాల్లో మరోసారి కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమవుతున్నారు. పోటీ పరీక్షల్లో సంస్కరణలు కోరుతూ యువత చేపట్టిన ఉద్యమానికి ఆమె తన మద్దతు ప్రకటించారు. ఇందులో భాగంగా, జూలై 27న ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో తాను స్వయంగా పాల్గొంటానని శుక్రవారం వెల్లడించారు.ఇదే సమయంలో, లోక్‌సభలో టీఎంసీ పార్లమెంటరీ పార్టీ ఉప నాయకుడిగా సీనియర్ నేత సౌగతా రాయ్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. బీర్భూమ్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు లోక్‌సభకు ఎన్నికైన నటి, రాజకీయ నాయకురాలు శతాబ్ది రాయ్ స్థానంలో సౌగతా రాయ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో, ఆ పార్టీకి చెందిన 20 మంది ఎంపీలు త్రిపుర కేంద్రంగా పనిచేసే 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా'లో చేరారు. వారిలో శతాబ్ది రాయ్ కూడా ఉన్నారు.మూడు రోజుల క్రితం కోల్‌కతాలో జరిగిన తృణమూల్ కాంగ్రెస్ అమరవీరుల దినోత్సవ ర్యాలీలో మమతా బెనర్జీ



ప్రసంగించారు. తాను త్వరలో కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలో పాల్గొంటానని ఆ సందర్భంగా వెల్లడించారు. తాజాగా, ఆ నిరసనలో పాల్గొనే తేదీని ఆమె ఖరారు చేశారు.తన ఢిల్లీ పర్యటనలో మమతా బెనర్జీ కేవలం సీజేపీ నేతృత్వంలోని ఉద్యమంలో పాల్గొనడానికే పరిమితమవుతారా లేక వివిధ ప్రతిపక్ష పార్టీల నాయకులతో, ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనాయకత్వంతో సమావేశాలు నిర్వహిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది.

## బీఆర్ఎస్‌లోనే ఉంటా..

### పార్టీ మారడం లేదు

### : మాజీ మంత్రి మల్లారెడ్డి



తాను బీఆర్ఎస్ పార్టీ మారడం లేదని అవన్నీ ఊహాగానాలేనని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం బోయినపల్లి క్యాంప్ కార్యాలయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇటీవల తాను బీఆర్ఎస్‌ను వీడుతున్నానని వస్తున్న పూర్తి అవాస్తమన్నారు. కేటీఆర్ 125 ఏండ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. కాగా, ఇటీవల సోషల్ మీడియాలో మల్లారెడ్డి బీజేపీలో చేరుతున్నాడనే ప్రచారానికి చెక్ పెట్టినట్లయింది.


RNI No Tel / 2012 /4241
# హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## పాలకుల వివక్ష పై పాత్రికేయులు పోరాటాలకు సిద్ధం కావాలి

### – టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

### – ఘనంగా కూకట్ పల్లి మహాసభ






హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి తిరిగి అశోక్ , జూలై 24:
తెలంగాణ ఉద్యమంలో త్యాగాలకు సిద్దపడి పోరాడిన జర్నలిస్టులు పాలకుల వివక్ష కు, నిర్లక్ష్యానికి గురవుతున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు కనీసం అక్రెడిటేషన్లు సక్రమంగా ఇవ్వలేని దుస్థితి నెలకొందని, దీనిపై రోడ్డెక్కి ఆందోళన చేయాల్సి దౌర్భాగ్యమైన పరిస్థితి రావడం బాధాకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.
శుక్రవారం కూకట్ పల్లిలోని ఏఎస్ రాజు నగర్ కమ్యూనిటీ హాల్ లో టీడబ్ల్యూజేఎఫ్ కూకట్ పల్లి నియోజకవర్గం మహాసభ ఘనంగా జరిగింది. ఈ మహాసభలో మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ, రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై టీడబ్ల్యూజేఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని అన్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సహించరానిదని, పాలకుల నిర్లక్ష్యం, వివక్షపై రాబోయే రోజుల్లో పాత్రికేయుల పోరాటం తీవ్రతరం చేయాల్సి వస్తుందని అన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కూడా జర్నలిస్టులను చిన్న చూపు చూస్తున్నదని, జర్నలిస్టులకున్న ఏకైక సదుపాయం అయిన రైల్వే చార్జీలో 50 శాతం రాయితీని ఎత్తివేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యలపై ఈనెల 27న “ఛలో పార్లమెంట్“ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ ను మరింత బలోపేతం చేసి, రాబోయే రోజుల్లో సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ ఏ రాజకీయ పార్టీకి గానీ, ఏ ఒక్క పత్రికకు గానీ అనుబంధం కాదని, ఈ అపోహాలతో జర్నలిస్టులు అయోమయంలో పడొద్దని అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు కట్టెల మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ సభ్యుడు జగదీశ్వర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాగరాజు గౌడ్, సీనియర్ జర్నలిస్టులు విద్యా వెంకట్, ఎర్ర యాకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది అశోక్, ఉపాధ్యక్షుడు కొండల్ రెడ్డి,హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్ పల్లి కమిటీ ఎన్నిక

ఈ మహాసభ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ కూకట్ పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నూతన కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్ర యాకయ్య, ఉపాధ్యక్షుడిగా బొమ్మ గోపి,ప్రధాన కార్యదర్శిగా అంజిబాబు,సంయుక్త కార్యదర్శి గా నాగార్జున,కోశాధికారి గా షబ్బీర్, కార్యవర్గ సభ్యులుగా నాగరాజు గౌడ్,సైదులు, శ్యాం సుందర్,జే. నవీన్, సుజాత, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మహేందర్ తదితరులు ఎన్నికయ్యారు.

## కౌలు రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

### గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి

### అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణికి రైతు సంఘాల వినతి

వరంగల్, జులై 24 హైదరాబాద్ ఎస్టేట్:
గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కౌలు రైతులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కౌలు రైతులను అధికారికంగా గుర్తిస్తూ గుర్తింపు కార్డులు జారీ చేసి, రైతు భరోసా, పంట బీమా, పంట నష్టపరిహారం, రుణ సదుపాయాలు సహా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కల్పించాలని కోరుతూ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎన్నికల సమయంలో కౌలు రైతులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో అత్యధిక శ్రమించే కౌలు రైతులకు ప్రభుత్వ గుర్తింపు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అందుబాటులోకి రావడం లేదని



తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు ఇతరుల భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తూ పెరుగుతున్న సాగు వ్యయాలు, అధిక కౌలు భారం, గిట్టుబాటు ధరల లేమితో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు కౌలు చెల్లిస్తున్నప్పటికీ పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితులు నెలకొంటున్నాయని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టపోయినా కౌలు రైతులకు పరిహారం, పంట బీమా వంటి ప్రయోజనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2011 భూ అధీకృత సాగుదారుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి కౌలు రైతులకు చట్టబద్ధ గుర్తింపు కల్పించాలని, విత్తనాలు, ఎరువులు, రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, అఖిల భారత కిసాన్ సంఘటన్ కన్వీనర్ సుధమల్ల భాస్కర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఓదెల రాజయ్య, ఏఐకేఎస్ జిల్లా కన్వీనర్ వల్లందాస్ కుమార్, ఏఐకేఎఫ్ జిల్లా నాయకుడు ఐత నగేష్, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కలబ్‌గూర్‌నందికండి దేవాలయాల అభివృద్ధికి కేంద్రానికి వినతి

### – కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ భేటీ

న్యూఢిల్లీ, జులై 24 హైదరాబాద్ ఎస్టేట్:
సంగారెడ్డి జిల్లాలోని చారిత్రక కలబ్‌గూర్, నందికండి ప్రాచీన దేవాలయాలను పరిరక్షించి జాతీయ స్థాయి ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ను కోరారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించి, దేవాలయాల సమగ్ర అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నందికండి ఆలయం 11వ శతాబ్దానికి చెందిన అరుదైన చారిత్రక కట్టడమని, భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) సంరక్షణలో ఉన్న ఈ ఆలయంతో పాటు కలబ్‌గూర్ దేవాలయానికి కూడా విశిష్ట చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని వివరించారు. దేశ నలుమూలల నుంచి భక్తులు, పర్యాటకులు, చరిత్ర పరిశోధకులు సందర్శిస్తున్నప్పటికీ, తగిన మౌలిక సదుపాయాల లేమితో ఈ దేవాలయాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందడం లేదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దేవాలయాల పరిరక్షణ, పునరుద్ధరణతో పాటు రహదారులు, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు, సుందరీకరణ, సమాచార బోర్డులు, పర్యాటక మార్గదర్శక కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కేంద్ర పర్యాటక శాఖ వారసత్వ, ఆధ్యాత్మిక పర్యాటక పథకాల కింద ప్రత్యేక నిధులు కేటాయించి ఈ దేవాలయాలను జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల



రాష్ట్ర సాంస్కృతిక వారసత్వ పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక పర్యాటకం, స్థానిక ఉపాధి, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఊతం లభిస్తుందని వివరించారు. ఈ భేటీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ నాయకులు శివకుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టిన రోజు సందర్భంగా, కేసీఆర్ సాక్షిగా.. పారబట్టి మొక్కనాటిన కేటీఆర్...

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన పుట్టినరోజును శుక్రవారం కుటుంబ సభ్యుల సమక్షంలో నిరాడంబరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన తనయుడికి ఆశీస్సులు అందించి, నిండు నూరేళ్లు సంపూర్ణ ఆరోగ్యంతో వర్ధిల్లాలని దీవించారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని కేటీఆర్ స్వయంగా పార పట్టి, తండ్రి సమక్షంలో మొక్క నాటి మట్టి పోయడం విశేషం.మాజీ ఎంపీ సంతోష్ కుమార్ పిలుపు మేరకు గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా కేటీఆర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్‌తో పాటు కేసీఆర్, కేటీఆర్ భార్య శైలిమ, కుమారుడు హిమాన్షు, కుమార్తె రియాన్షి కూడా మొక్కలు నాటారు. ప్రకృతి వ్యవసాయంపై మక్కువ ఉన్న కేసీఆర్ ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనడం అందరినీ ఆకట్టుకుంది.
రాజకీయాలకు అతీతంగా, పూర్తి కుటుంబ వాతావరణంలో జరిగిన ఈ వేడుకకు సంబంధించిన వీడియోలు, ఫోటోలను బీఆర్ఎస్ పార్టీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకుంది. ఈ పోస్టులు సామాజిక మాధ్యమాల్లో స్వల్ప



వ్యవధిలోనే వైరల్ అయ్యాయి. అటు కుటుంబ బంధాలకు, ఇటు పర్యావరణ స్పృహకు ప్రతీకంగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు సాగాయని పార్టీ శ్రేణులు, అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## సూర్జిత్ నగర్ అభివృద్ధి ఎక్కడ..?

### అసంపూర్తి రోడ్లుడ్రైనేజీతో నరకయాతన.. ప్రజలను ఆదుకోవాలని సీపీఎం డిమాండ్

### కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై అధికారుల తక్షణ జోక్యం అవసరం: కారు ఉపేందర్

### సమస్యలు పరిష్కరించకపోతే కాలనీవాసులతో కలిసి ఉద్యమం తప్పదని హెచ్చరిక



వరంగల్, జూలై 24 హైదరాబాద్ ఎస్టేట్:
హనుమకొండ నగరంలోని 31వ డివిజన్ న్యూ శాయంపేట పరిధిలోని సూర్జిత్ నగర్ అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అసంపూర్తిగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు కారు ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ పిలుపు మేరకు శుక్రవారం సూర్జిత్ నగర్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల సర్వేలో ఆయన మాట్లాడారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు మంజూరై పనులు ప్రారంభించినప్పటికీ, కాంట్రాక్టర్ కేవలం మట్టి పోసి పనులను అర్థాంతరంగా నిలిపివేశారని ఆరోపించారు. దీంతో వర్షం పడిన ప్రతిసారి రహదారులు బురదమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డాక్టర్స్ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు లోతట్టు ప్రాంతమైన సూర్జిత్ నగర్‌లోకి చేరి ఇండ్లలోకి ప్రవేశిస్తోందని, దీనివల్ల నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు పాడై పేద కుటుంబాలు భారీ ఆర్థిక నష్టాన్ని చవిచూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు పూర్తవుతాయని ఆశించిన ప్రజలకు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా తీవ్ర నిరాశ ఎదురైందన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు ప్రమాదంలో పడే పరిస్థితులు నెలకొన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ప్రత్యేక సమీక్ష నిర్వహించి రోడ్లు, డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ఇంటి స్థలం లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని, అర్హులందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు అందించాలని, నిరుద్యోగ యువతకు ప్రభుత్వ రుణాలు మంజూరు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టి దోమల నివారణ మందులు పిచికారీ చేయడంతో పాటు ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాలనీవాసుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రజలను ఐక్యం చేసి పెద్దఎత్తున ఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని కారు ఉపేందర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సర్వేలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కురుకు రంజిత్, సీపీఎం నాయకులు ధర్నా ప్రభాకర్, వంగ సదానందం, ఎండి షర్ఫుద్దీన్, లాసాని గోపాల్, అచ్చునూరి ఐలయ్య, ఎర్ర అంజమ్మ, కోర్ర బేబీ, రాధిక తదితరులు పాల్గొన్నారు.ం

## కందుకూరు పోలీస్ స్టేషన్ సిఐ వెంకటేశ్వర్లు కు ఘనంగా పౌర సన్మానం

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 24
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం లో ఇటీవల 10 లక్షల దోపిడీ కేసులో నిందితుల నుండి పది లక్షలు రికవరీ చేసి బాధితులు కందుకూరు మండలం అన్నోజిగూడ




నివాసి ఢిల్లీ నారాయణకు తక్కువ సమయంలో నిందితుల నుండి పది లక్షల రూపాయలు రికవరీ చేసి ఇప్పించినందుకు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు మరియు తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ కందుకూరు పోలీస్ స్టేషన్ కు విచ్చేసి శాలువతో సిఐ వెంకటేశ్వర్లకు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ పోలీస్ టీమ్ లో వారిలో కందుకూరు పోలీస్ స్టేషన్ ఎస్ ఐ పరమేశ్వర, కానిస్టేబుల్ మహేష్, మల్లేష్, శేఖర్లకు కూడా అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సంఘ సేవకులు కోరేళ్ళ చంద్రయ్య మహేశ్వరం మహేశ్వరం మండలం, హైకోర్టు న్యాయవాది గద్ద గూటి ఎట్టయ్య, ఢిల్లీ యాదయ్య, కటికల మహేందర్, కొరివి సురేందర్, శ్రీరాములు పిసిసి కోఆర్డినేటర్ శ్రీ ఢిల్లీ శివకుమార్ తదితరులు పాల్గొని మిఠాయిలు కందుకూరు పోలీస్ స్టేషన్ సిబ్బందికి పంచి అభినందించారు.

## నందిగామ సీఐ వీరభద్రను సన్మానించిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ నేత పెంజర్ల యాదయ్య

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 24
నందిగామ పోలీస్ స్టేషన్‌లో సీఐ వీరభద్రను మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పెంజర్ల యాదయ్య మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి,పుష్పగుచ్ఛంఅందజేశారు. ఈ సందర్భంగా సీఐ వీరభద్రకు శుభాకాంక్షలు తెలిపిన యాదయ్య,ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తూ,శాంతిభద్రతల పరిరక్షణలో మరింత చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ,వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.పోలీస్ శాఖ చేస్తున్న సేవలను అభినందిస్తూ,నందిగామ ప్రాంతంలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
25 శనివారం జూలై 2026

# ఆర్టిఏ ఆఫీసుల్లోకి బ్రోకర్లకు నో ఎంట్రీ.

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్


హైదరాబాద్ రాష్ట్రంలోని అన్ని రవాణా శాఖ ఆఫీసుల్లో బ్రోకర్లు. ఏజెంట్లకు నో ఎంట్రీ విధానాన్ని పక్కగా అమలు చేయాలని విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ జాయింట్ ట్ ట్రాన్సపోర్ట్ కమిషనర్ (జే టి సి )చంద్రశేఖర్ గౌడ్ డిటిసిలు. డీటీఓలకు స్పష్టమైన సర్కులర్ జారీ చేశారు. ప్రజా సేవల విశ్వనీయతను దెబ్బతీస్తూ ఏజెంట్లతో కుమ్మక్కై అధికారులు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ సిటీతో పాటు జిల్లాలోని కార్యాలయాల వద్ద బ్రోకర్ల కార్యకలాపాలపై నిఘ ఉంచాలని తెలిపారు. మరోవైపు సాంకేతిక కారణాలతో పెండింగులో ఉన్న ఆర్సీలు డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తులను అధికారులు వెంటనే పరిష్కరించాలని జేటిసి ఆదేశించారు

# ఆగస్టు 25లోగా విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 24:-
రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులను ఆగస్టు 25లోగా అందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్య, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖల అధికారులతో యూనిఫాంల పంపిణీ, పంటల సాగు, సీజనల్ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ, విద్యార్థుల కొలతలు సేకరించడం, మాస్టర్ టైలర్లు, స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా దుస్తుల కుట్టింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులను వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు, కందులు, పెసర్లు, కూరగాయల సాగు వైపు ప్రోత్సహించాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రతి మండలంలో పాఠశాలల వారీగా యూనిఫాం తయారీకి కార్యాచరణ రూపొందించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి అమలుపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. యూనిఫాం తయారీలో నాణ్యతతో పాటు లక్ష్య సాధనకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. వస్త్రాల స్వీకరణ నుంచి కటింగ్, కుట్టింపు, నాణ్యత తనిఖీ, పాఠశాలలకు పంపిణీ వరకు ప్రతి దశను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎంఈఓలు, ఏపీఎంలు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్మయి, డీఆర్‌డీఓ కృష్ణారెడ్డి, డీఈఓ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి సుజాతతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో బీటెక్ విద్యార్థిని అనుమానాస్పద మృతి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 24:-
రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థిని యమల మానస (20) శుక్రవారం సాయంత్రం హాస్టల్ గదిలో ఉరివేసుకున్న స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ఖమ్మం జిల్లా బల్లేపల్లి గ్రామానికి చెందిన మానస తండ్రి పేరు కాసిం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమికంగా రూమ్మేట్ తెలిపిన సమాచారం ప్రకారం ప్రేమ వ్యవహారానికి సంబంధించిన వ్యక్తిగత కారణాలు ఉండవచ్చనే అనుమానం వ్యక్తమవుతున్నప్పటికీ, దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. విద్యార్థిని మృతికి గల అసలు కారణాలు పోలీసుల దర్యాప్తు అనంతరం మాత్రమే వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# నీట్ లీక్‌పై ఇబ్రహీంపట్నంలో నిరసన..

## విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతిదీ జూలై 24:-
ఇబ్రహీంపట్నం చౌరస్తాలో నీట్ (NEET) ప్రశ్నాపత్రం లీక్ ఘటనకు నిరసనగా పార్టీలకు అతీతంగా పలువురు విద్యార్థులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసిన ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారు, నీట్ పరీక్షలో చోటుచేసుకున్న ప్రశ్నాపత్రం లీక్ దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎంతో శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతుంటే, ఇలాంటి అవకతవకలు వారి భవిష్యత్తును అనిశ్చితిలోకి నెడుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర, పారదర్శక, నిష్పాక్షిక విచారణ జరిపి, లీక్‌కు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, ఈ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. దేశంలోని విద్యార్థుల భవిష్యత్తు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని నిరసనకారులు స్పష్టం చేశారు.

# ఎన్‌హెచ్-65పై ఫ్లైఓవర్ల నిర్మాణానికి కేంద్రాన్ని కోరిన ఎంపీ రవిచంద్ర

## నితిన్ గడ్కరీతో భేటీ.. నిజాంపూర్ ఎక్స్‌రోడ్డు, అరూర్ జంక్షన్‌ల అభివృద్ధికి వినతి



న్యూఢిల్లీ, జులై 24 హైదరాబాద్ ఎస్టేట్:
సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల పరిధిలోని జాతీయ రహదారి-65పై నిజాంపూర్ ఎక్స్‌రోడ్డు, అరూర్ గ్రామ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్లు నిర్మించి, పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించి, ప్రజల భద్రత దృష్ట్యా ఈ ప్రతిపాదనను అత్యవసరంగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంలో నిజాంపూర్ ఎక్స్‌రోడ్డు, అరూర్ జంక్షన్లు సంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామాలకు కీలక అనుసంధాన కేంద్రాలుగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతిరోజూ భారీ సరుకు రవాణా వాహనాలు, బస్సులు, వ్యవసాయ వాహనాలు, ద్విచక్ర వాహనాలు వేల సంఖ్యలో ఈ మార్గంలో ప్రయాణిస్తున్నాయని, ఫ్లైఓవర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుని ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌తో సమస్య మరింత తీవ్రతరమవుతోందని వివరించారు. ఈ రెండు జంక్షన్ల వద్ద ఫ్లైఓవర్లు నిర్మిస్తే రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గడంతో పాటు ట్రాఫిక్ అంతరాయం లేకుండా సాఫీగా సాగుతుందని, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర సేవల వాహనాలకు సురక్షిత రాకపోకలు కల్పించవచ్చని తెలిపారు. అలాగే ప్రాంతీయ రవాణా వ్యవస్థ బలోపేతమై సంగారెడ్డి జిల్లా సామాజిక, ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఫ్లైఓవర్ల నిర్మాణానికి తక్షణమే పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, అవసరమైన నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈ భేటీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ నాయకులు శివకుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ ఆరు మొక్కలు... పచ్చని గంగదేవిపల్లికి శ్రీకారం

## వనమహోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చిన గ్రామపంచాయతీ

## మొక్కలు నాటి సంరక్షిస్తేనే భావితరాలకు స్వచ్ఛమైన భవిష్యత్: సర్పంచ్ కూసం స్వరూప్‌రమేష్



గీసుగొండ, జూలై 24 హైదరాబాద్ ఎస్టేట్:
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమాన్ని గంగదేవిపల్లి గ్రామపంచాయతీ ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించింది. గ్రామ సర్పంచ్ కూసం స్వరూప్‌రమేష్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి ఆరు రకాల మొక్కలను పంపిణీ చేస్తూ గ్రామాన్ని పచ్చదనంతో కళకళలాడేలా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని ప్రతి కుటుంబం మొక్కలను నాటి వాటిని సంరక్షించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు విశేష స్పందన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కూసం స్వరూప్‌రమేష్ మాట్లాడుతూ, "మొక్క నాటడం ఒక బాధ్యతకు ఆరంభం మాత్రమే. దానిని పెంచి పరిరక్షించినప్పుడే వనమహోత్సవం సార్థకమవుతుంది. నేడు నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని ప్రకృతి, ఆరోగ్యకరమైన జీవనానికి చిరునామాగా నిలుస్తుంది. ప్రతి ఇంటి ఆవరణలో మొక్క పెరిగితే ప్రతి గ్రామం హరితహారంగా మారుతుంది; ప్రతి గ్రామం పచ్చబడితే తెలంగాణ మరింత సస్యశ్యామలంగా వెలుగొందుతుంది" అని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన హరిత కార్యక్రమాల విజయానికి ప్రజలే అసలైన బలమని, అందరికీ పంపిణీ చేసిన మొక్కలను తప్పనిసరిగా నాటి వాటిని బిడ్డల్లా సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేడిద ప్రశాంత్, గ్రామ కార్యదర్శి రాజు, సీఏ పెండ్లి జనార్ధన్, గ్రామ కరబార్ చెంచు రాజు, ఆశా వర్కర్ కూస పద్మ, వార్డు సభ్యులు కన్నె లింగమూర్తి, పెండ్లి కొమురెల్లి, గోనె రామ, గూడ మంజుల, కొడారి కవిత, సల్ల రాజ్‌కుమార్, గ్రామ పెద్దలు గోనె రాజయ్య, గోపతి మల్లయ్యతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలను స్వీకరించారు. "ఒక్క ఇంటికి ఆరు మొక్కలు... ప్రతి ఇంటా పచ్చదనం ప్రతి గ్రామం హరితవనం ప్రతి తెలంగాణ పచ్చని భవిష్యత్" అనే నినాదంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# అన్యాయానికి గురైన వారికి అండగా కేటీఆర్

## ప్రజల పక్షాన అలుపెరగని పోరాట యోధుడు.. యువతకు ఆదర్శం

## దాస్యం వినయ్ భాస్కర్

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు.. వృద్ధులు, దివ్యాంగులకు పండ్ల పంపిణీ



హనుమకొండ, జూలై 24 హైదరాబాద్ ఎస్టేట్:
భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆర్భాట వేడుకలకు దూరంగా ఉంటూ రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, హనుమకొండలోని ఫాతిమా జంక్షన్ సమీపంలోని హౌస్ ఆఫ్ జాయ్లో కాజీపేట బీఆర్ఎస్ నాయకులు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొని వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో న్యాయం కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులకు కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తోందని అన్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని కేటీఆర్ తన జన్మదిన వేడుకలను జరుపుకోకుండా సేవా కార్యక్రమాలకే ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. అదే స్ఫూర్తితో పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారని పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అంగన్‌వాడీ చిన్నారులకు ఆట వస్తువులు, వృద్ధులు, దివ్యాంగులకు పండ్ల పంపిణీ, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేయడంతో పాటు యువకులు రక్తదాన శిబిరాల్లో పాల్గొనడం కేటీఆర్ సేవా భావానికి నిదర్శనమని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచిన కేటీఆర్, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రిగా తెలంగాణ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ముఖ్యంగా ఐటీ రంగంలో తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. నిజాయితీ, నిబద్ధత, కార్యదీక్ష కలిగిన యువ నాయకుడిగా కేటీఆర్ తెలంగాణ యువతకు ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, పేదలు, రైతులు, విద్యార్థులు, యువత, అన్యాయానికి గురవుతున్న వర్గాల సమస్యలపై కేటీఆర్ నిరంతరం పోరాడుతున్నారని దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో కేటీఆర్ నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసి, కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులంతా సమష్టిగా కృషి చేస్తారని ఆయన స్పష్టం చేశారు. కేటీఆర్ స్ఫూర్తితో గులాబీ శ్రేణులు ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాన్ని కొనసాగిస్తూ, ఎక్కడ అన్యాయం జరిగినా ప్రజల పక్షాన నిలబడతాయని తెలిపారు.

# ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా మరియు సోషల్ మీడియా మిత్రులకు!

విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, జర్నలిస్టులపై జరిగిన దాడికి బాధ్యులు ఎవరు?

వాళ్ళపై క్రిమినల్ కేసులు పెట్టాలి!దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర చీవవ్ పేపర్ leak gurinchi CJP వాళ్ళు జరిపిన ధర్నాలో అటు ఆందోళనకారులపై ఇటు పోలీసులు, జర్నలిస్టులపై దాడి జరిగింది.

దాడి జరిగిన ఆందోళనకారులను అఋఋఎ చేయాలని అడుగుతున్నాం,

మరి విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై, జర్నలిస్టులపై గూడ విచక్షణారహితంగా దాడి జరిగింది. దీనికి బాధ్యులు ఎవరు? పోలీసులు, జర్నలిస్టులపై దాడి చేసిన వాళ్ళపై క్రిమినల్ కేసులు పెట్టాలి.

పోలీసులు, జర్నలిస్టులకు గూడ నష్టపరిహారం ఇవ్వాలి, వాళ్ళు గూడ మనుషులే కదా! మానవతా విలువలు కోల్పోయి ఇలా దాడులు చేసుకోవడానికి లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా తీవ్రంగా ఖండిస్తుంది.

*ఇట్లు*
**M.Dasharath naik
స్టేట్ ప్రెసిడెంట్
లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా
తెలంగాణ రాష్ట్రం.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# మొకిలాలో కార్డన్ అండ్ సెర్చ్.. డ్రగ్స్, సైబర్ నేరాలపై పోలీసుల హెచ్చరిక

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 24:- రంగారెడ్డి జిల్లా, మొకిలా: ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని మొకిలా పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల నివారణ లక్ష్యంగా శుక్రవారం తెల్లవారుజామున విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ పర్యవేక్షణలో ఇంద్రారెడ్డి నగర్ ఫేజ్2 ప్రాంతంలో ఉదయం 6 గంటల నుంచి ఈ తనిఖీలు చేపట్టారు. ఆపరేషన్ సందర్భంగా సుమారు వంద ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీలలో గుట్కా ప్యాకెట్లు, మద్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు వాహనాలపై ఉన్న పెండింగ్ ట్రాఫిక్ చలాన్లను అక్కడికక్కడే చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. పాపిలాన్ బయోమెట్రిక్ పరికరం ద్వారా అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలను సేకరించి వారి వివరాలను ధృవీకరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా కొనసాగించారు. తనిఖీల






అనంతరం చేవెళ్ల ఏసీపీ బి. కిషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం, నిల్వ, విక్రయం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్‌లను ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరి అని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన పోలీసు సేవలను వినియోగించుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మొకిలా, శంకర్‌పల్లి, మొయినాబాద్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణాపై ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడి

## కిలోకు పైగా గంజాయి స్వాధీనం.. ఒకరు అరెస్ట్, ఇద్దరు పరారీ

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 24:- రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముఠాపై ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడి నిర్వహించి కిలోకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపేట సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎక్సైజ్ అధికారులకు అందిన విశ్వసనీయ సమాచారంతో ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ ఎస్సై బషీర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను అడ్డుకుని తనిఖీ చేయగా వారి వద్ద నుంచి సుమారు కిలోకు పైగా గంజాయి లభ్యమైంది. వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకుని, ముఠాకు చెందిన ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే మరో ఇద్దరు నిందితులు అధికారులను గమనించి అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. స్వాధీనం చేసుకున్న గంజాయిని ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు సేకరిస్తుండగా, పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక



నిఘా కొనసాగుతోందని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# తెలంగాణలోని బ్రిక్స్ అసోసియేషన్ లను ఏకం చేస్తాం

## కరీంనగర్ బ్రిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్జ నరసింహా గౌడ్

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి తిరిగి అశోక్ రాష్ట్రంలోని ఇటిక లారీల యాజమాన్యాల సమస్యల పరిష్కారం కొరకు యూనియన్ అన్నింటిని ఏకం చేస్తామని కరీంనగర్ బ్రిక్ అసోసియేషను అధ్యక్షుడు గుర్జ నరసింహ గౌడు అన్నారు.

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని మందమల్లమ్మ ఫంక్షన్ హాల్ దగ్గర ఉన్న బ్రిక్స్ అసోసియేషన్, అత్తాపూర్ బ్రిక్స్ అసోసియేషన్, సన్ సిటీ బ్రిక్స్ అసోసియేషన్, అలాగే మియాపూర్ బ్రిక్స్ అసోసియేషన్ సభ్యులు మరియు లారీ ఓనర్లతో సమావేశాలు నిర్వహించడం జరిగింది.

ఈ సమావేశాల్లో అన్ని అసోసియేషన్ల నుంచి ఎంతో మంచి స్పందన లభించింది. ప్రతి ఒక్క లారీ ఓనర్ ముందుకు వచ్చి తమ పూర్తి మద్దతు మరియు సంఘీభావాన్ని తెలియజేశారు. నిన్నటి నుంచి



హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని వివిధ ఇటుక లోడింగ్ అడ్డాలను సందర్శిస్తూ, అక్కడి ఓనర్లతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగింది. ప్రతి చోటా సానుకూల స్పందన రావడం ఎంతో ఆనందంగా ఉంది.

ఈరోజు నుంచి మా వెంట ఉంటామని, మా




పోరాటానికి పూర్తి సహకారం అందిస్తామని ప్రతి ఒక్కరూ హామీ ఇవ్వడం జరిగింది. మాకు అండగా నిలిచి సంఘీభావం ప్రకటించిన ప్రతి ఒక్క లారీ ఓనర్‌కు, అసోసియేషన్ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము అని తెలిపారు

# జోగి రమేశ్ కుటుంబంపై మరో వివాదం... పోలీసులకు ఫిర్యాదు చేసిన కోడలు మేఘన

మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత జోగి రమేశ్ కుటుంబం తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటోంది. తనను వరకట్నం కోసం వేధిస్తున్నారని, శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారని ఆరోపిస్తూ ఆయన కోడలు మేఘన పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు జోగి రమేశ్, ఆయన కుమారుడు రాజీవ్ సహా కుటుంబ సభ్యులు 11 మందిపై పోలీసులు గృహ హింస కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే, జోగి రమేశ్ కుమారుడు రాజీవ్‌తో మేఘనకు గత ఏడాది మే నెలలో వివాహం జరిగింది. పెళ్లైన కొన్నాళ్ల నుంచే అదనపు కట్నం



కోసం భర్త రాజీవ్, అత్తమామలు, ఇతర కుటుంబ సభ్యులు తనను వేధించడం ప్రారంభించారని మేఘన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగినా ఫలితం లేకపోయిందని, వేధింపులు మరింత ఎక్కువయ్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తనకు ప్రాణహాని ఉందని భావించిన మేఘన, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు గృహ హింస, వరకట్న వేధింపులు, మోసం, హత్యాయత్నం వంటి తీవ్రమైన సెక్షన్ల కింద జోగి రమేశ్, ఆయన కుమారుడు రాజీవ్ సహా మొత్తం 11 మందిపై కేసు నమోదు చేశారు. ఈ కేసుపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, సాక్ష్యాధారాలు సేకరించి త్వరలోనే నిందితులను విచారిస్తామని ఇబ్రహీంపట్నం పోలీసులు తెలిపారు.

# రాజ్యాంగ పరిరక్షణ సెమినార్‌ను విజయవంతం చేయాలి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 24:- వనస్థలిపురం, "రాజ్యాంగాన్ని కాపాడుకుందాంరక్షించుకుందాం" అనే అంశంపై ఈ నెల 26న ఎల్‌బీనగర్‌లోని మహాత్మా గాంధీ కళాశాలలో నిర్వహించనున్న సెమినార్‌ను యువత, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, సామాజిక సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భూష రాజు కాశయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వనస్థలిపురం రైతుబజార్ చౌరస్తాలో కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీసీ వెల్ఫేర్ శాఖ మాజీ డైరెక్టర్, అడ్వకేట్ బాలచందర్ మాట్లాడుతూ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణి, ప్రముఖ ఆర్థికవేత్త, రాజకీయ విశ్లేషకుడు డాక్టర్ పరకాల ప్రభాకర్, తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ జి. విద్యాసాగర్ తదితరులు సెమినార్‌లో పాల్గొంటారని తెలిపారు. దేశంలో విద్య, వైద్యం, నిరుద్యోగం వంటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయని, విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని నాయకులు విమర్శించారు. ఉపాధి హామీ, రైతు, కార్మిక చట్టాల్లో మార్పులతో పాటు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్



చేశారు. కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు సైదులు, కేవీపీఎస్, గిరిజన సంఘాల నాయకులు శ్రీనివాసు, మల్లయ్య, ఋషి, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పిలుపు మేరకు బిజినపల్లి మండల కేంద్రంలో ఘనంగా భారత్ బంద్ విజయవంతం

## నీట్ అక్రమాలు, పేపర్ లీకేజీలు, విద్యార్థులపై పోలీసుల దాడులను ఖండిస్తూ విద్యార్థి సంఘాల నిరసన





హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి బిజినపల్లి, జూలై 24: దేశవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ తదితర వామపక్ష విద్యార్థి సంఘాల జాతీయ పిలుపు మేరకు నిర్వహించిన భారత్ బంద్ నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల కేంద్రంలో ఘనంగా విజయవంతమైంది. విద్యార్థి నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి బలుమల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, దేశంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధానాలను విద్యార్థి సంఘాలు ఎన్నటికీ సహించబోవని అన్నారు. నీట్ పరీక్షలలో చోటుచేసుకున్న అక్రమాలు, పేపర్ లీకేజీలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఘటనలని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర, పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థి, యువజన సంఘాలు నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం, నాయకులను బలవంతంగా చెదరగొట్టడం, పలువురిని అదుపులోకి తీసుకోవడం, విద్యార్థులపై బలప్రయోగానికి దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని తీవ్రంగా ఖండించారు. ప్రశ్నించే విద్యార్థుల గొంతును అణచివేయాలని చేసే ప్రయత్నాలను దేశ ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం ఎంతమాత్రం సమంజసం కాదని అన్నారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన, సమాన విద్య అందించేలా చర్యలు చేపట్టాలని, పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. విద్య హక్కును పరిరక్షించేందుకు అవసరమైతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సంతోష్, ప్రభు, చెన్నకేశవ, అరవింద్, మధు, సందీప్, శివశంకర్, నందు మరియు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఘన శ్రీకారం

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాలతో రాంపురంలో ముగ్గు కార్యక్రమం







గీసుగొండ, జూలై 24 హైదరాబాద్ ఎస్టేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రాంపురం గ్రామంలో లబ్ధిదారురాలు పులి రమాదేవి (భర్త: రమేష్) ఇంటి నిర్మాణానికి శుక్రవారం సంప్రదాయబద్ధంగా ముగ్గు వేసి శుభారంభం చేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు రాంపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వరిగల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాడి శివ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కట్టుబడి పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మర్రి క్రాంతి, గ్రామ కార్యదర్శి బండ ప్రవీణ్, గ్రామ ఉపసర్పంచ్ సూరయ్య, పాకాల శ్రీధర్, పులి కోర్నెల్, దర్శనాల చిన్న కుమారస్వామి, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు.

RNI No Tel /2012 /4241
# హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
25 శనివారం జూలై 2026

# కేటీఆర్ జన్మదిన వేడుకల్లో సంప్రదాయ క్రీడలకు పెద్దపీట

### – తెలంగాణ భవన్‌లో ఘనంగా కుస్తీ పోటీలు..

### – బీఆర్ఎస్ అగ్రనేతలతో కలిసి పాల్గొన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర





హైదరాబాద్, జూలై 24 హైదరాబాద్ ఎస్టేట్:
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు (కేటీఆర్) 50వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సంప్రదాయ కుస్తీ పోటీలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి తదితర ప్రముఖులతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై కుస్తీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, కేటీఆర్ తదితరులు పోటీల్లో పాల్గొన్న మల్లయోధులను అభినందించి, విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. సంప్రదాయ క్రీడలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని, యువతలో క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంలో కుస్తీ వంటి క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవా లక్ష్మీ, పార్టీ సీనియర్ నాయకులు చిరుమళ్ల రాకేష్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి, గడ్డం శ్రీనివాస్ యాదవ్, తుల ఉమతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోటీలను వీక్షించేందుకు అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావడంతో తెలంగాణ భవన్ సందడిగా మారింది. కేటీఆర్ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ క్రీడలతో నిర్వహించడం విశేషంగా నిలిచిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశాకే 'నీట్'పై చర్చ

### : రాహుల్ గాంధీ



నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు లోక్‌సభలో ఎలాంటి చర్చకూ ఒప్పుకునేది లేదని విపక్ష నేత (ఎల్ఓపీ) రాహుల్ గాంధీ శుక్రవారం స్పష్టం చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించాకే తదుపరి సంభాషణ ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు. విపక్షాల ఆందోళనల నడుమ లోక్‌సభ వాయిదా పడిన కాసేపటికే ఈ పరిణామం చోటుచేసుకుంది. అంతకుముందు, పేపర్ లీకేజీల అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సభలో ప్రకటించారు. పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కఠిన చట్టాలు తెస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే హామీ ఇచ్చారని గుర్తుచేస్తూ, రాహుల్ గాంధీ చర్చకు సహకరించాలని రిజిజు కోరారు.

అనంతరం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, తన మైక్‌ను లాగేసుకున్నారని ఆరోపించారు. విద్యార్థుల తరఫున విపక్షాలు మూడు ప్రధాన డిమాండ్లు చేస్తున్నాయని ఆయన పునరుద్ఘాటించారు. అవి:

1. "అవినీతిపరుడైన" విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి.
2. నిరసన చేస్తున్న విద్యార్థులపై దాడి చేసి, కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి.
3. విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలి.


"ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించే వరకు మేం ఎలాంటి చర్చలు జరపబోం," అని రాహుల్ దృఢంగా చెప్పారు. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి నీట్-యూజీ పరీక్ష పత్రాల లీకేజీ అంశం పార్లమెంటును కుదిపేస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కొత్త చట్టం తెచ్చామని చెబుతున్నప్పటికీ, మంత్రి రాజీనామా చేయాల్సిందేనని విపక్షాలు పట్టుబడుతున్నాయి. ఈ వివాదంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది.

# స్వచ్ఛ భారత్‌కు స్ఫూర్తి సంత్ గాడ్గే బాబా.. భారతరత్నతో గౌరవించాలి

### – హైదరాబాద్ ట్యాంక్‌బండ్, ఢిల్లీలో గాడ్గే బాబా విగ్రహాలు ఏర్పాటు చేయాలి

### – చాపర్తి కుమార్ గాడ్గే

నారాయణఖేడ్, జులై 24 హైదరాబాద్ ఎస్టేట్:
స్వచ్ఛత, సామాజిక సంస్కరణలు, విద్యా సేవలకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు సంత్ గాడ్గే బాబా మహారాజ్‌కు భారతరత్న పురస్కారం ప్రకటించాలని, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌తో పాటు దేశ రాజధాని ఢిల్లీలో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేయాలని రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. నారాయణఖేడ్ మండలం అబ్బేంద గ్రామ రచ్చబండ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యానికి పూర్వమే సంత్ గాడ్గే బాబా అబ్బేంద గ్రామాన్ని సందర్శించి మూడు రోజుల పాటు స్వయంగా చీపురుపట్టి గ్రామ వీధులను శుభ్రం చేస్తూ పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, విద్యా ప్రాధాన్యం, మద్యపాన నిషేధం, మూఢనమ్మకాల నిర్మూలనపై ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకొచ్చారని తెలిపారు. పరిశుభ్రమైన గ్రామాలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని ఆయన బోధించారని పేర్కొన్నారు. సంత్ గాడ్గే బాబా అనాథాశ్రమాలు, గోశాలలు, విద్యాసంస్థలు, సేవా ఆశ్రమాలను స్థాపించి జీవితాంతం సమాజ సేవకే అంకితమయ్యారని చెప్పారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమలవుతున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి ఆయన ఆశయాలు, సేవలే స్ఫూర్తిగా నిలిచాయని పేర్కొన్నారు. గాడ్గే బాబా సేవలకు గుర్తింపుగా భారతరత్న ప్రకటించడంతో పాటు హైదరాబాద్ ట్యాంక్‌బండ్, ఢిల్లీలో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను కోరారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి



పూలే, వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలతో బీసీలు రాజకీయంగా ఐక్యమై సామాజిక న్యాయం సాధించాలని చాపర్తి కుమార్ గాడ్గే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు చాకలి ప్రశాంత్ రజక, గ్రామ పెద్దలు, రజక సంఘ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష లీకేజీపై బాధ్యత వహించాలి

### : ఎమ్మెల్యే KR నాగరాజు గారు...

### - కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి.



నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ, అందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్,ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ గారి ఆధ్వర్యంలో పర్వతగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిర్వహించిన ధర్నాలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు విద్యార్థులపై జరిగిన దాడులు అక్రమ అరెస్టులు లాటి చార్జీలను తీవ్రంగా ఖండించారు.కేంద్ర ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైందన్నారు.పరీక్ష వ్యవస్థపై ప్రజల్లో ఏర్పడిన అనుమానాలను వెంటనే నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు.నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వల్ల ఎంతో మంది విద్యార్థులు మరణించారని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని,కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సరైంది కాదన్నారు. విద్యార్థులపై దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ గాడి తప్పుతుందన్నారు.ప్రశ్నపత్రం లీక్ పై లక్షలాది మంది విద్యార్థులు ఆందోళన చేపడితే... మోడీ సర్కార్ లాఠీలు,రబ్బర్ బుల్లెట్లు, టియార్ గ్యాస్ ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండించారు.
ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సావిత్రి,సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్వర రావు,చౌటపల్లి సొసైటీ చైర్మెన్ గొర్రె దేవేందర్,మాజీ జడ్పీటీసీ బానోత్ సింగులాల్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు,పర్వతగిరి సర్పంచ్ శంకర్,గ్రామ శాఖ అధ్యక్షులు రాంచందర్,నియోజకవర్గ,మండల,గ్రామ సీనియర్ నాయకులు, నాయకులు,కార్యకర్తలు మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లాలో ఆయుష్ వైద్య సేవల అభివృద్ధి పై పార్లమెంట్ లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

న్యూఢిల్లీ - పార్లమెంట్ తేది:24-07-2026
వరంగల్ జిల్లాలో ఆయుష్ వైద్య సేవల అభివృద్ధి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. ప్రధానంగా జిల్లాలో ఆయుష్ వైద్య సేవల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంత మేర నిధులు కేటాయించింది? ఎలాంటి మౌలిక వసతులు కల్పించింది? ఆయుష్ సేవలను సాధారణ వైద్య వ్యవస్థతో ఎలా అనుసంధానం చేస్తోంది? అనే అంశాలపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్న లేవనెత్తారు. ఈ మేరకు వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాధవ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జాతీయ ఆయుష్ మిషన్ (ఎన్ఏఎం) కింద వరంగల్ జిల్లాలోని తొమ్మిది ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల భవనాల మరమ్మతులు, తాగునీరు, మరుగుదొడ్ల



సదుపాయాలు, శాశ్వత యోగా షెడ్ల నిర్మాణానికి కేంద్రం మద్దతు అందించినట్లు మంత్రి తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో అదనపు బ్లాక్ నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ ఆయుర్వేద బోధనా ఆసుపత్రి, ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల అభివృద్ధితో పాటు తొమ్మిది ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, రెండు ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీలకు అవసరమైన మందుల సరఫరా కోసం గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో కేంద్రం గణనీయమైన నిధులు విడుదల చేసినట్లు వెల్లడించారు. 2023-24లో రూ.56.16 లక్షలు, 2024-25లో రూ.24.32 లక్షలు, 2025-26లో రూ.3.23 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో ఆయుష్ వ్యవస్థ కీలక పాత్ర పోషించాలన్నారు. జిల్లాలో ఆయుర్వేదం, యోగా, హోమియోపతి తదితర ప్రత్యామ్నాయ వైద్య విధానాల విస్తరణకు అవసరమైన నిధులు, మౌలిక వసతులు మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, ఆయుష్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించే విధంగా కేంద్రం కృషి చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.

# నీట్ పేపర్ లీక్‌పై కాజీపేట చౌరస్తాలో కాంగ్రెస్ రాస్తారోకో

### – రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టులను ఖండించిన కాంగ్రెస్ నేతలు

### – కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్ (చీజుజు) పేపర్ లీక్ వ్యవహారాన్ని నిరసిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ కాజీపేట చౌరస్తాలో ఈరోజు కాజీపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు శ్రీ రాహుల్ గాంధీ, శ్రీమతి ప్రియాంక గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టులను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. అలాగే నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమం టీపీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు శ్రీ ఇనగాల వెంకట్రామిరెడ్డి పిలుపు మేరకు నిర్వహించారు. "విద్యార్థుల పక్షాన మేమున్నాం" అనే నినాదంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పూర్తిగా కోల్పోయిన కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని విమర్శించారు. వరుసగా పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ కావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థుల కష్టాన్ని, వారి కలలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, వెంటనే నీట్ పేపర్ లీక్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం రాస్తారోకోలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని కాజీపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కాజీపేట సీఐ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో పోలీసులు తరలించారు. ఈ కార్యక్రమంలో 62, 63, 47 డివిజన్లకు చెందిన




నాయకులు పాల్గొన్నారు. 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రాజాలి, హనుమకొండ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆరూరి సాంబయ్య, మాజీ కార్పొరేటర్లు సుంచు అశోక్, గుంటి కుమారస్వామి, డా. శ్రవణ్, దొంగల కుమార్, సీరిల్ లారెన్స్, షేక్ అజ్జర్, షబ్బీర్ (తబ్బు), తమ్మడి మనసా మధు, మాచర్ల జయకర్, బర్ల రాజ్‌కుమార్, పోగుల శ్రీనివాస్, మంతుర్తి బొంద్యాలు, శివరాం, రవికిరణ్, సుంచు ప్రవీణ్, ప్రశాంత్, రజియా, కొండ శివ, జై రావు, ఎండి షకీల్ (మైనారిటీ జనరల్ సెక్రటరీ), బొడ్డు రామ్, గాలి శ్రీను, మాతంగి స్వామి, దార్ల రాజ్‌కుమార్, గోరుకాటి రవి, గుగ్గిళ్ల అనిల్, శ్రీనుతో పాటు కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రవితేజా కుటుంబం నుంచి మరో హీరో...

## 'మారెమ్మ' రిలీజ్ డేట్ ఫిక్స్

మాస్ మహారాజా రవితేజ కుటుంబం నుంచి మరో యువ నటుడు తెలుగు తెరకు పరిచయం కాబోతున్నాడు. రవితేజ సోదరుడి కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మారెమ్మ'. ఈ సినిమా విడుదల తేదీని చిత్ర బృందం బుధవారం ప్రకటించింది. సెప్టెంబర్ 10న ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది.

మాధవ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు మంచాల నాగరాజ్ తెరకెక్కించిన గ్రామీణ నేపథ్య యాక్షన్ డ్రామా 'మారెమ్మ'. నిర్మాణ సంస్థ 'మోక్ష ఆర్ట్స్' తమ సోషల్ మీడియా వేదికగా సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ, "రక్తం, నమ్మకం, త్యాగంతో కూడిన ఒక సాహసోపేతమైన కథ మిమ్మల్ని భావోద్వేగ ప్రయాణంలోకి తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. సెప్టెంబర్ 10, 2026న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఘనంగా విడుదల కానుంది" అని పేర్కొంది. చిత్ర బృందం విడుదల చేసిన తాజా పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఇందులో మాధవ్ ఉగ్రరూపంలో, పోరాటంలో అలసిపోయినట్లుగా కనిపిస్తున్నారు. నాటకీయత ఉట్టిపడేలా ఉన్న ఈ పోస్టర్‌లో కథానాయకుడికి, ఒక పవిత్రమైన గోవుకు మధ్య ప్రతీకాత్మకమైన ముఖాముఖిని ఆసక్తికరంగా చూపించారు. 'మారెమ్మ' చిత్రం ద్వారా మంచాల నాగరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'మోక్ష ఆర్ట్స్' బ్యానర్‌పై మయూర్ రెడ్డి బండారు ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, పాటలు సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. తనదైన గ్రామీణ కథా శైలితో ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటోందన్న సంకేతాలను ఇచ్చింది. గ్రామీణ నేపథ్యంలో సాగే 'మారెమ్మ', స్థానిక సంప్రదాయాలతో కూడిన భావోద్వేగభరితమైన యాక్షన్ డ్రామాగా రూపొందింది. బలమైన మానవ




సంబంధాలను ఈ కథ ఆవిష్కరిస్తుందని చిత్ర బృందం వెల్లడించింది. ఈ సినిమాలో దీపా బాలు కథానాయికగా నటిస్తోంది. సాంకేతిక విభాగంలో ప్రశాంత్ ఆర్. విహారి సంగీతం అందించగా, ప్రశాంత్ అంకిరెడ్డి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహించారు.

# ముచ్చటగా మూడోసారి?



అగ్ర కథానాయిక పూజాహెగ్డే తెలుగులో పూర్వవైభవం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నది. ప్రస్తుతం తెలుగులో దుల్కర్‌సల్మాన్‌తో కలిసి ఓ సినిమాలో నటిస్తున్నదీ భామ. శర్వానంద్ 'జార్జ్‌క్రిష్' చిత్రంలో ఆమెనే కథానాయిక అని ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో పూజాహెగ్డే టాలీవుడ్‌లో మరో భారీ ఆఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. అగ్ర హీరో అల్లు అర్జున్‌తో ఈ సొగసరి ముచ్చటగా మూడోసారి జోడీకట్టబోతున్నదని వార్తలు వినిపిస్తున్నాయి.

వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం అల్లు అర్జున్ సైన్స్ ఫిక్షన్ 'రాకా'లో నటిస్తున్నారు. అట్లీ దర్శకుడు. ఈ సినిమా పూర్తయిన తర్వాత లోకేష్ కనకరాజ్ డైరెక్షన్‌లో బన్నీ సినిమా కన్‌ఫర్మ్ అయిన విషయం తెలిసిందే. ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన కూడా వెలువడింది. ఇందులో పూజాహెగ్డే కథానాయికగా ఖరారయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఫిల్మ్‌నగర్ టాక్. గతంలో అల్లు అర్జున్-పూజాహెగ్డే జోడీ 'డీజే' 'అల వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో కలిసి నటించారు.

# వైట్ డ్రెస్‌లో క్యూట్‌గా మెరిసిన నిధి అగర్వాల్

టాలీవుడ్ అందాల భామ నిధి అగర్వాల్ తన గ్లామరస్ లుక్స్‌తో సోషల్ మీడియాలో ఎప్పుడూ రచ్చ చేస్తూనే ఉంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోషూట్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. తెల్లటి లెహంగాలో దేవకన్యలా మెరిసిపోతున్న నిధి పిక్స్ చూసి అభిమానులు ఫిదా అయిపోతున్నారు. రాయల్ ఎలిగెన్స్, మోడర్న్ స్టైల్ కలబోతగా ఉన్న ఆమె ఈ లేటెస్ట్ ఫోటోషూట్ విశేషాలేంటో ఇప్పుడు చూద్దాం.. వైట్ ఇండియన్ సిండ్రెల్లా నిధి: ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో నిధి అగర్వాల్ తెల్లటి డిజైనర్ లెహంగా చోళీ ధరించి మెరిసిపోయింది. ఇక ఆ డ్రెస్‌పై చేసిన ముత్యాలు, సీక్విన్స్, మెరిసే ఎంబ్రాయిడరీ వర్క్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. మ్యాచింగ్ పారదర్శక దుపట్టాతో ఒక దేవకన్యలా, వైట్ సిండ్రెల్లా లాగా కనిపిస్తూ నెటిజన్ల మనసు దోచుకుంటోంది. రాయల్ లుక్‌లో అదరగొట్టిన భామ: డ్రెస్‌కు తగ్గట్టుగానే నిధి తన జ్యువెలరీ సెలక్షన్ విషయంలో కూడా మంచి కేర్ తీసుకుంది. ఇక పింక్, గ్రీన్ కలర్ స్టోన్స్ ఉన్న హెవీ చోకర్ నెక్లెస్, దానికి తగ్గట్టుగా ఉన్న కమ్మలు ధరించి రాయల్ లుక్‌లో మెరిసింది. లైట్ మేకప్, లూజ్ హెయిర్‌స్టైల్, ముఖంపై ఉన్న చిన్న బొట్టు ఆమె సాంప్రదాయ లుక్‌ను హైలెట్ గా నిలబెట్టాయి. కెరీర్ ప్రయాణం.. హిట్ చిత్రాలు: తెలుగులో నాగార్జున అక్కినేని సమర్పణలో వచ్చిన 'సవ్యాసాచి' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన నిధి, రామ్ పోతినేని 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంతో మాస్ ఆడియన్స్‌కు దగ్గరైంది. ఇక ఆ తర్వాత తమిళంలో 'ఈశ్వరన్', అలాగే 'కలగ తలైవన్', 'హీరో' వంటి సినిమాల్లో నటించి నటిగా



మంచి గుర్తింపు తెచ్చుకుంది. కొత్త ప్రాజెక్ట్‌ల కోసం ఎదురుచూపులు: ఇటీవల రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్' సినిమాలో కనిపించినా, ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద అనుకున్నంతగా ప్రభావం చూపలేకపోయింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో నిత్యం ఫోటోషూట్లతో సందడి చేస్తున్న ఈ భామ, తన తదుపరి సినిమాల ప్రకటనను త్వరలోనే వెల్లడిస్తుందని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గ్లామర్‌తో పాటు నటనలోనూ



మంచి గుర్తింపు తెచ్చుకున్న నిధి అగర్వాల్, తన ట్రెండీ అండ్ రాయల్ పిక్స్‌తో కుర్రకారును ఆకట్టుకోవడంలో ఎప్పుడూ ముందే ఉంటుంది. ఈ వైట్ డ్రెస్‌లో ఆమె విజువల్స్ నిజంగానే కంటికి విందుగా ఉన్నాయి. త్వరలోనే ఆమె మంచి ప్రాజెక్ట్‌తో బిగ్ స్క్రీన్ పై మళ్ళీ అలరించాలని ఆశిద్దాం.

# బిగ్ బాస్ అవకాశాన్ని వదులుకున్నా..


## కారణం ఇదే: సత్యశ్రీ



బుల్లితెరపై పాపులర్ కామెడీ షో 'జబర్దస్త్' ద్వారా గుర్తింపును సంపాదించుకున్న నటి సత్యశ్రీ. ముఖ్యంగా చమ్మక్ చంద్ర టీమ్‌లో సుదీర్ఘకాలం అలరించిన ఆమె, తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుని మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఆ గుర్తింపుతోనే వెండితెరపైనా వరుస అవకాశాలు దక్కించుకుంటూ నటిగా ముందుకు సాగుతోంది. అయితే గత కొంతకాలంగా ఆమె బుల్లితెర బిగ్గెస్ట్ రియాలిటీ షో 'బిగ్‌బాస్'లోకి ఎంట్రీ ఇవ్వబోతోందంటూ నెట్టింట ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సత్యశ్రీ ఈ ప్రచారంపై స్పందిస్తూ అసలు నిజాలను వెల్లడించింది. తనకు బిగ్‌బాస్ నిర్వాహకుల నుంచి పిలుపు వచ్చిందనేది వాస్తవమేనని, ఆఫర్ వచ్చిందని స్పష్టం చేసింది. అయితే ఆ క్రేజీ అవకాశాన్ని తాను ఒప్పుకోలేకపోయానని తెలిపింది. తనపై కుటుంబ బాధ్యతలు ఎక్కువగా ఉన్నాయని, ఇంటి బయట తాను చూసుకోవాల్సిన పనులు చాలా ఉన్నాయని పేర్కొంది. అంతేకాకుండా తన కుటుంబ సభ్యులను వదిలి సుదీర్ఘకాలం దూరంగా ఉండటం తన వల్ల కాదని, అందుకే బిగ్‌బాస్ ఆఫర్‌ను వదులుకోవాల్సి వచ్చిందని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈమె టీవీ షోలతో పాటు సినిమాల్లోనూ నటిస్తూ తన కెరీర్‌ను బిజీగా గడిపేస్తోంది.

# మౌనం ప్రమాదకరం..

## నోరు విప్పండి: మంచు లక్ష్మి



సమాజంలో జరుగుతున్న పరిణామాలపై పౌరుల మౌనం ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నోరు విప్పాలని సినీ నటి, నిర్మాత మంచు లక్ష్మి పిలుపునిచ్చారు. 'మనకెందుకులే' అని దాటుకెళ్లే మనస్తత్వాన్ని వీడి, ప్రజా సమస్యలపై గళం విప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లడఖ్ రాజ్యాంగ హక్కులు, పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడుతున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌కు మద్దతు ప్రకటిస్తూ ఆమె ఇన్స్టాగ్రామ్‌లో ఒక సందేశాన్ని పంచుకున్నారు. దేశంలో ఏ విపత్తు లేదా సమస్య వచ్చినా తమకేమీ పట్టనట్లు ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతమని మంచు లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. అందరూ రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సిన పనిలేదని.. కనీసం సామాజిక మాధ్యమాల ద్వారానైనా గొంతు కలపడం, విషయాలపై అవగాహన పెంచుకోవడం పౌరులుగా మన బాధ్యత అని గుర్తుచేశారు. నిస్వార్థంగా ప్రజల కోసం పోరాడే వాంగ్‌చుక్ వంటి యోధులకు సమాజం అండగా నిలవాలని కోరారు. కేవలం రాజకీయ నాయకులను వేలెత్తి చూపడంతో బాధ్యత తీరిపోదని, దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పౌరులు కార్యోన్ముఖులు కావాలని కోరారు. చుట్టూ జరుగుతున్న పరిస్థితులను చూస్తూ ఊరుకోవడం తనను తీవ్రంగా కలచివేస్తోందని ఆమె భావోద్వేగానికి గురయ్యారు.

# కల్యాణ్‌రామ్ కొత్త సినిమా



ప్రస్తుతం వెంకటేష్‌తో కలిసి ఓ మల్టీస్టారర్ సినిమాలో నటిస్తున్నారు కల్యాణ్‌రామ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటున్నది. ఇదిలావుండగా కల్యాణ్‌రామ్ మరో సినిమాకు ఓకే చెప్పారని తెలిసింది. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు తెరకెక్కించబోతున్న ఈ చిత్రానికి పరశురామ్ దర్శకత్వం వహిస్తారని సమాచారం. వీశీజఱవం'ఫ్యామిలీ స్టార్' పరాజయంతో దర్శకుడు పరశురామ్ కెరీర్‌కు కాస్త బ్రేక్‌నిచ్చారు. తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఓ యూనిక్ పాయింట్‌తో కథను సిద్ధం చేశారని తెలిసింది. దీనిని కల్యాణ్‌రామ్‌కి వినిపించగా ఆయన సానుకూలంగా స్పందించారని ఫిల్మ్‌నగర్ టాక్ వినిపిస్తున్నది. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.







